క్లుప్తంగా

జగనన్న పాలనలోనే గిరిజన గ్రామాల అభివృద్ధి


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, సర్పంచ్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: జగనన్న ప్రభుత్వ పాలనలోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ అన్నారు. దామనాపల్లి పంచాయతీలో రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. మును పెన్నడూ లేని విధంగా ఏజెన్సీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వార్డు సభ్యులు రాజేశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతానికి కోతుల తరలింపు


పట్టుబడిన కోతులకు ఆహారం ఇస్తున్న గ్రామస్తులు

రాజవొమ్మంగి: మండలకేంద్రంలో పెరిగిపోయిన కోతులను ఏరివేసే కార్యక్రమం ఆదివారం మొదలైంది. కోతుల ఆగడాలు శృతిమించిపోవడంతో విసుగెత్తిపోయిన స్థానికులు చందాలు వేసుకొని సర్పంచ్ రమణి ఆధ్వర్యంలో బోనులు ఏర్పాటు చేశారు. గ్రామంలో నాలుగు వైపుల ఏర్పాటు చేసిన నాలుగు బోనుల్లో ఆదివారం దాదాపు 500 కోతులు పట్టుబడ్డాయి. వాటికి ఆహారం, నీరు ఇస్తున్నారు. వాటిని సురక్షితంగా బోన్లతో సహా వ్యాన్‌లపై ఎక్కించి లోతట్టు అటవీ ప్రాంతానికి తరలించిన పలువురు గ్రామస్తులు అక్కడ వదిలిపెట్టారు. ఒక్కో కోతిని తరలించేందుకు సుమారు రూ.450 వెచ్చిస్తున్నట్టు పలువురు చెబుతున్నారు. ఈ ప్రక్రియ మరో కొన్నాళ్ల పాటు కొనసాగుతుందని స్థానికులు తెలిపారు.

మత్స్యగుండం ఆలయ ఉత్సవ కమిటీ ఎన్నిక


ఉత్సవ కమిటీ ఎన్నికల్లో పాల్గొన్న సభ్యులు

హుకుంపేట: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మత్స్యగుండం ఆలయంలో వచ్చే నెల 7,8,9 తేదీల్లో నిర్వహించనున్నట్టు మహాశివరాత్రి వేడుకలకు ఉత్సవ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. మత్స్యలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ, గ్రామపెద్దల సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా గోపాల పాత్రుడు, మత్స్యకొండబాబు, ఉపాధ్యక్షుడిగా ఈశ్వర్, కోశాధికారిగా భీమ్‌బాబు, కార్యవర్గ సభ్యులుగా రాంబాబు నాయులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్, సర్పంచ్ శాంతకుమారి మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామస్తులు, యువకులు సహకరించాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు అప్పారవు, చంద్రశేఖర్, కేశ్వరరావు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

మీడియా పాయింట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ వెంకటలక్ష్మి, సర్పంచులు తదితరులు

రాజవొమ్మంగి: మండలకేంద్రంలో అంబేడ్కర్ విగ్రహ సమీపంలో ఏర్పాటు చేయనున్న మీడియా పాయింట్ భవనానికి ఆదివారం శంకుస్థాపన జరిగింది. ప్రెస్‌క్లబ్ భవనం కోసం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ క్రమంలో స్థల కేటాయింపు జరగడంతో స్థానిక ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు గొల్లపూడి పెద్దిరాజు, కుంజం జగన్నాథం, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు బాలరాజు, శివ, రామరాజు తదితరులు భూమి పూజ చేశారు. భవన నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని పలువురు ముందుకు వచ్చారు.

ప్రగతి పరవళ్లు



- ఏళ్ల తర్వాత తీరిన సమస్యలు
- అభివృద్ధి పథంలో గిరిజన గ్రామాలు
- మండలంలో రూ.75.94కోట్లతో నూతన రహదారులు
- రూ.23 కోట్లతో తాగునీటి కల్పన
- రూ.48కోట్లతో 94 పాఠశాలలకు భవనాలు, మౌలిక వసతులు
- చెంతకే ప్రభుత్వ సేవలు
- ఆనందంలో గిరిజనం

మండలం: ముంచంగిపుట్టు

పంచాయతీలు	:23
గ్రామాలు	:376
జనాభా	:48,245
గ్రామ సచివాలయాలు	:18
వెల్‌నెస్ సెంటర్లు	:18
ఆర్‌బీకేలు	:8
సచివాలయ ఉద్యోగులు	:135 మంది
గ్రామ వలంటీర్లు	:207 మంది


జోలాపుట్టులో ప్రభుత్వ పాఠశాల


75 ఏళ్ల తర్వాత మోక్షం కలిగిన బూసిపుట్టు రహదారి


ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందిస్తున్న వలంటీర్


ఆర్‌బీకే ద్వారా విత్తనాలు పొందుతున్న గిరిజన రైతులు

ముంచంగిపుట్టు: గతంలో సరైన రహదారులు లేక ప్రయాణ పాట్లు, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పాఠశాలల పరిస్థితులు, తాగునీటి కోసం మైళ్ల దూరం కాలినడకతో వెళ్లి ఊట గెడ్డ నీటిని తీసుకువచ్చేందుకు అవస్థలు...ప్రభుత్వం ద్వారా ఏ పథకం పొందాలన్నా సరైన అవగాహన లేక అర్హత ఉండి సైతం పొందలేకపోతున్న వైనం..ఇదంతా టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏళ్ల తరబడి గిరిజనులు ఎదుర్కొన్న ఇక్కట్లు...నేక సమస్యలతో అభివృద్ధికి దూరంగా సంక్షేమమే తెలియక సతమతమైన వైనం... అదంతా గతం... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తూ నేడు ముంచంగిపుట్టు మండలం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. నాడు -నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు, పీహెచ్‌సీల్లో మౌలిక సదుపాయాలు, పంచాయతీ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ నిధులతో మారుమూల గ్రామాలకు పక్క రహదారులు, పంచాయతీ స్థాయిలోనే గ్రామ సచివాలయాల ఏర్పాటు చేసి అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి.

తలుపు తట్టి పింఛన్ అందజేత

ప్రతి నెల ఒకటో తేదీన గడప వద్దకే పింఛన్ అందించడం. గిరిజన రైతుల వ్యవసాయంలో సాయం అందించడంతో పాటు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనాలు పంపిణీ. పోడు భూములకు పట్టాలు అందించడం. తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు ఏర్పాటు చేసి ప్రసవం అనంతరం ఇంటి వద్దకే వాహనంలో బాలింత, శిశువును దిగబెట్టడం. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామస్థాయిలో మెరుగైన వైద్యం అందించడం. సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు రూ.10వేలు పింఛన్ అందించడం ఇలా గతం కన్నా మెరుగైన సేవలు, అభివృద్ధి, సంక్షేమంతో ముంచంగిపుట్టు మండలం రూపురేఖలు మారాయి.

94 పాఠశాలల్లో అభివృద్ధి పనులు

ముంచంగిపుట్టు మండలంలో వివిధ యాజమాన్యాల కింద 205 పాఠశాలలు ఉన్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు-నేడు ద్వారా రెండు విడతల్లో 94 పాఠశాలల్లో వివిధ అభివృద్ధి పనులు చేశారు. మన బడి నాడు నేడు ఫేజ్-1లో 39 పాఠశాలలను ఎంపిక చేసి వాటికి రూ.21కోట్ల నిధులు కేటాయించారు. ఆయా నిధులతో అభివృద్ధి పనులు చేశారు. ఫేజ్-2లో 32 పాఠశాలలు ఎంపిక చేశారు.రూ.18కోట్లు కేటాయించారు. వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయి. రూ.9కోట్లు నిధులు కేటాయించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన సౌకర్యాలు, నాణ్యమైన బోధన ఆహ్లాదకరమైన వాతావరణం నాంది పలికింది. డెస్కులతో కూడిన బెంచీలు, గ్రీన్ బోర్డు, టైల్స్, ప్రహరీ గోడలు, ఆలోచనాత్మకమైన విజ్ఞానాన్ని పెంపొందించే రంగు రంగుల బొమ్మలతో ప్రభుత్వ బడులు కొత్త సొబగులు దర్శనమిస్తున్నాయి.

75 సంవత్సరాల తరువాత జగనన్న పాలనలోనే ఏజెన్సీలో రహదారులకు మోక్షం

75ఏళ్ల సాతంత్ర్యంలో నేడు మండలంలోని రంగబయలు, బుంగాపుట్టు, బూసిపుట్టు పంచాయతీ కేంద్రాలకు పక్కా బీటీ రోడ్డు సౌకర్యం జగనన్న ప్రభుత్వ హయాంలో కలిగింది. గతంలో అధ్వాన రహదారితో మూడు పంచాయతీల గిరిజనులు నానా అవస్థలు పడేవారు. సరైన రహదారి లేక అంబులెన్స్ వాహనాలు వచ్చే పరిస్థితి లేని కారణంగా అత్యవసర సమయాల్లో చికిత్స రోగులు ఆస్పత్రికి తరలిస్తూ ఉండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మూడు పంచాయతీలకు పక్కా రహదారులు వచ్చాయి. అపరాడ నుంచి రంగబయలు పంచాయతీ కేంద్రం మీదుగా జొడిగుమ్మ వరకు పీఆర్ ప్రాజెక్టు ద్వారా రూ.16.90కోట్లతో 18కిలో మీటర్ల రోడ్డు అందుబాటులోకి వచ్చింది.లబ్బూరు జంక్షన్ నుంచి బుంగాపుట్టు పంచాయ కేంద్రం వరకు రూ.13.94కోట్లతో 28 కిలోమీటర్ల రోడ్డు వేశారు. రూడకోట నుంచి బూసిపుట్టు పంచాయతీ కేంద్రం మీదగా ఒడిశా సరిహద్దు వరకు రూ.15.40కోట్లతో పక్క రహదారిని అధికారులు పూర్తి చేశారు. గత నాలుగేళ్లలో 144 గ్రామాలకు రూ.75.94కోట్లతో 136 కిలో మీటర్ల తారురోడ్డును ప్రభుత్వం వేసింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏజెన్సీలోని శివారు గ్రామాలకు సైతం పక్కా రహదారులు దర్శనమిస్తున్నాయి.

తీరిన తాగు నీటి సమస్య

మండలంలోని 23 పంచాయతీల్లో 68 గ్రామాలకు తాగునీటి సమస్యను ప్రభుత్వం తీర్చింది. ఆర్‌డబ్ల్యూఎస్, జెడ్పీ, ఎంపీపీ నిధులతో ప్రభుత్వం గత నాలుగేళ్లలో రూ.23కోట్లతో తాగునీటి బోర్లు, పైపు లైన్లు, బావులు, గ్రావిటీ పథకాలను గిరిజన గ్రామాల్లో ఏర్పాటు చేసి నీటి సమస్యను తీర్చగలిగింది. తాగునీటి కోసం గతంలో సుదూర ప్రాంతాలకు వెళ్లే తమకు జగనన్న ప్రభుత్వం పుణ్యమా అని తాగునీటి అవస్థలు తీరాయని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు జల్‌జీవన్ మిషన్ ద్వారా సైతం 76 గ్రామాల్లో జోరుగా నీటి పనులు జరుగుతున్నాయి. కిలగాడ పీహెచ్‌సీకి నూతన భవనం నిర్మాణం చేయడంతో ఐదు పంచాయతీలకు వైద్య సేవలు చేరువయ్యాయి.12 అంగన్‌వాడీ కేంద్రాలకు జోరుగా సొంత భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి.

చేరువైన ప్రభుత్వ పాలన

గతంలో ప్రభుత్వ పథకాలు పొందాలంటే నానా అవస్థలు పడేవారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులయ్యేవి కాదు. ఏళ్ల తరబడి నిరీక్షించేవారు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు ఏర్పాటుతో గ్రామ స్థాయిలోనే చకచక పనులు అవుతున్నాయి. గ్రామ వలంటీర్ల వ్యవస్థ ద్వారా పింఛన్ పంపిణీ తీరు పూర్తిగా మారిపోయింది.ఆధార్, రేషన్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు వెంటనే అందుతున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామాల్లో వైద్యులు, సిబ్బంది ఇంటింటికి వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు జరుగుతున్నాయి.


గ్రామ సచివాలయం ద్వారా ధ్రువపత్రాలు పొందిన గిరిజనులు

జగనన్నకు రుణపడి ఉంటాం



గతంలో రోడ్డు సౌకర్యం లేక చాలా కష్టాలు పడ్డాం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత బీటీ రోడ్డు మంజూరైంది. రహదారి పనులు వేగంగా పూర్తి కావడంతో 75 ఏళ్ల కష్టాలకు తెరపడింది. రవాణా వ్యవస్థ అందుబాటులో వచ్చింది. గిరిజనులంతా జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఎం.విజయ్, కొండగాబుల గ్రామం, బుంగాపుట్టు పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

సదుపాయాలు బాగున్నాయి



ఆశ్రమ పాఠశాలలో సరైన వసతుల్లేక ఇబ్బంది పడేవాళ్లం. తరగతి గదుల్లో కూర్చోవడానికి బెంచీలు లేక నేలపై కూర్చొనేవాళ్లం.ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు.బెంచీలు, పాఠశాలలో ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. నాడు-నేడు పనులతో మా ఇబ్బందులు తొలగాయి. మంచి వాతావరణంలో మెరుగైన విద్యా బోధన జరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన సదుపాయాలు కల్పించారు.

– రానా ఫాతీమా, విద్యార్థిని

పెరుగుతున్న అడ్మిషన్లు



రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించడం సంతోషంగా ఉంది. బడుల్లో నాణ్యమైన భోజనం. ఉత్తమ బోధన ఇతర సదుపాయాల కల్పనతో తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్య పట్ల ఆసక్తి పెరిగింది. విద్యార్థుల అడ్మిషన్లు ఏటా పెరిగుతున్నాయి. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరిగింది.

– కె.కృష్ణమూర్తి, ఎంఈవో, ముంచంగిపుట్టు

షర్మిల పర్యటనతో ఒరిగేదేమి లేదు


జి.మాడుగులలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: కాంగ్రెస్ పార్టీ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల పాడేరు నియోజకవర్గంలో చింతపల్లి పర్యటించడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఒరిగేదేమి లేదని వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ షర్మిల సమక్షంలో ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు చేరడాన్ని ఆయన ఖండించారు. విలువలు లేని నాయకులు వైఎస్సార్‌సీపీలో ఉన్నా లేకున్నా ఒకటేనన్నారు. వైఎస్సార్‌సీపీలో ఒక సామాన్యకార్యకర్తగా ఉన్న బుల్లిబాబుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఒక సముచిత స్థానం కల్పించి ట్రైకార్ చైర్మన్ పదవిని కల్పించారని గుర్తు చేశారు. మంచి పదవిని పొందినందుకు పార్టీకి నిబద్ధతతో ఉండాలి తప్పా పార్టీ మారడం సిగ్గు చేటు చర్య అని విమర్శించారు. పార్టీ మారినంత మాత్రన వైఎస్సార్‌సీపీకి ఒరిగేదేమి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు జగనన్న వెంటే ఉన్నారని పాడేరు నియోజవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని, మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోని రావడం తథ్యమన్నారు. వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.మత్స్యకొండం నాయుడు, సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు గబ్బాడి సన్యాసిదొర, కూడా చిన్నారావు, కించూరు సర్పంచ్ వంతాల రాంబాబు, నాయకులు చిట్టిబాబు, మన్మథరావు, పండన్న, రామారావు, ప్రకాష్, బాలయ్యపడాల్, వెంకటరమణ, లక్ష్మణ్‌పడాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ రోడ్‌షో

రంపచోడవరం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం రోడ్ షో నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. బి.వెలమలకోటలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన రోడ్‌షో ఐ.పోలవరం, వాడపల్లి వరకు సాగుతుందని పేర్కొన్నారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే, ఎమెల్సీల పర్యటన రేపు

కూనవరం: మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మంగళవారం పర్యటించనున్నట్టు అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కోతుల గుట్ట వెలుగు కార్యాలయం వద్ద ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని, పార్టీ ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, మండలస్థాయి అధికారులు, పార్టీ శ్రేణులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు హాజరుకాగలని కోరారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం నేడు

పెదబయలు: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ అరకు నియోజకవర్గం సమన్వయకర్త రేగం మత్స్యలింగం హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులతో నిర్వహించనున్న సమావేశంలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయంపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారం తప్పనిసరి


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బొజ్జయ్య

రంపచోడవరం: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని గైనకాలజిస్టు డాక్టర్ జి.మృదుల అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద వేద స్పైన్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గైనకాలజిస్టు డాక్టర్ మృదుల మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల ప్రసవాల సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. గర్భిణులు రక్తహీనత లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రసవ సమయంలో ప్రభుత్వం అందజేసే ఐరన్ ఫోలిక్ మాత్రలను వినియోగించాలన్నారు. వెన్నుముక నిపుణులు డాక్టర్ .తేజోఫణీంద్ర మాట్లాడుతూ వెన్నుముక టీబీ కేసులు పెరుగుతున్నాయన్నారు. పోషకాహారం లోపం వల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గి ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కువగా టీబీ కేసుల్లో వెన్నుముక టీబీ కేసులు నమోదవుతున్నట్టు చెప్పారు. వెన్నుముక టీబీపై అశ్రద్ధ చేస్తే కాళ్ల పక్షవాతం వచ్చే ప్రమాదముందన్నారు. నడుమ నొప్పితో పాటు జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం తదితర లక్షణాలుంటే స్పైన్ సర్జన్ కలవాలని సూచించారు. ఎముకల్లో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మంగా బొజ్జయ్య సందర్శించి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఉచిత మోగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని పలువురు సూచించారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం


ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పెదబయలు: మండల కేంద్రంలోని ఏపీ గురుకుల రెసిడెన్సియల్ కళాశాలలో ఇంటర్‌లో ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ తెలిపారు. ఈ నెల 11 నుంచి 15వ తేది వరకు ఐదు రోజుల పాటు పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కేంద్రంలో ఎంపీసీ-38 మంది, బైపీసీ-81 మంది మొత్తం కేంద్రంలో 119 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్టు చెప్పారు. రోజు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలు నిర్వహించనున్నట్టు పరీక్షలకు సంబంధించి కేంద్రంలో అన్ని సదుపాయాలు కల్పించినట్టు ఆమె తెలిపారు.

అడ్డతీగల: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు మొదటి రోజు ఆదివారం 39 మంది విద్యార్థులు హాజరైనట్టు అడ్డతీగల అనంత చక్రరావు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మదీనా తెలిపారు. అడ్డతీగలలోని బాలికల జూనియర్ కళాశాల, గురుకుల కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మొదటి రోజు బోటనీ సబ్జెక్ట్ ప్రాక్టికల్స్‌కి 40 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 39 మంది హాజరైనట్టు చెప్పారు.

రైతులకు అండగా ప్రభుత్వం


పత్రిమెట్టలో పల్పర్ యంత్రాలను అందజేస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

హుకుంపేట: గ్రామల్లో మంచి మిరియాలు సాగుచేస్తున్న గిరిజన రైతులకు ప్రభుత్వం మిరియాల పల్పర్ యంత్రాల పంపిణీ చేయడంతో పాటు అండగా నిలుస్తోందని సర్పంచ్ పాడి అప్పలనాయుడు అన్నారు. ఐటీడీఏ ద్వారా ప్రభుత్వం అందించిన మిరియాల పల్పర్ యంత్రాలను కుడబీరు, పత్రిమెట్ట, కూతంగి గ్రామల గిరిజన రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామల్లో వ్యవసాయ రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. తమ పంచాయతీ పరిధిలో మూడు గ్రామాలకు రూ.35వేల వ్యయం కలిగిన మిరియాల మిషన్‌ను 75% రాయితో ప్రభుత్వం ఐటీడీఏ తరవున అందించినట్టు తెలిపారు. మిరియాల రైతులకు మిషన్లు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించాలి


మాట్లాడుతున్న సీఐ రమేష్

జి.మాడుగుల: ఎన్నికల సమయాల్లో గ్రామాల్లో ఎటువంటి గొడవలు, అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు సీఐ రమేష్ హెచ్చరించారు. మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ బొర్రతాడి గ్రామాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. గ్రామంలో ప్రజలు సమస్యలు, ఇబ్బందులు గుర్చి ఆయన వాకబు చేశారు. సారా తయారీ, విక్రయాలు చేస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లోని సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు, యువత చెడు వ్యసనాలకు దూరం ఉండాలని ఆయన సూచించారు. గ్రామాల్లో అల్లర్లు, గొడవలు చేస్తే సహించేదిలేదన్నారు. ఎన్నికల్లో పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి, శాంతి భద్రత పరిరక్షణకు అందరు పోలీసులకు సహకరించాలని ఆయన తెలిపారు.

అల్లూరికి భారతరత్న ప్రకటించాలని డిమాండ్


అల్లూరి దాడి జరిపిన పురాతన స్టేషన్‌ను సందర్శించిన యువజన సంఘం నాయకులు

రాజవొమ్మంగి: మన్యం వీరుడు, తెలుగు జాతి ధీరత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజుకు భారతరత్న ఇవ్వాలని అల్లూరి జాతీయ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాజవొమ్మంగిలో పురాతన పోలీస్‌స్టేషన్ వారు సందర్శించారు. అల్లూరి విగ్రహం వద్ద జేజేలు పలికారు. జిల్లాలో గల అల్లూరి స్మారక చిహ్నాలను సందర్శిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంతంలో నడయాడి వందేళ్లుక పైగా అవుతోందని, అయినా నేటికి గిరిజనుల గుండెల్లో ఆయన చెరగని ముద్ర వేసుకొన్నారన్నారు. అల్లూరికి భారతరత్నం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అల్లూరి యువజన సంఘం నాయకుడు బాబ్జీ, రాజు తదితరులు పాల్గొన్నారు.